

సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం

# సిద్దిపేట బల్దియాలో.. 59.42% పన్నుల వసూలు

*లక్ష్యం రూ.15కోట్ల 37లక్షల 92వేలు*

*వసూలైన పన్ను రూ.9 కోట్ల 13లక్షల 78వేలు*

*వసూలు కావాల్సినది రూ.6కోట్ల 24లక్షలు14వేలు*

సిద్దిపేట, డిసెంబర్ 26: వంద శాతం పన్నుల వసూలే లక్ష్యంగా బల్దియా అధికారులు ముందుకు సాగుతున్నారు. 2023-24 సంవత్సరానికి బల్దియా పన్నుల వసూళ్ల లక్ష్యం, పాత బకాయిలతో కలిపి రూ.15కోట్ల 37లక్షల 92వేలు కాగా, ఇప్పటి వరకు రూ.9కోట్ల 13లక్షలు78లక్షలు పన్ను వసూలు చేశారు. ఇప్పటి వరకు మొత్తంగా 59.42 శాతం పన్నుల వసులు చేసినట్లు అధికారులు తెలిపారు.

సిద్దిపేట పట్టణంలో మొత్తం పన్నుల వసూళ్ల అసెస్మెంట్లు 34,180 ఉండగా వాటిని మూడు కేటాగిరిలుగా విభజించారు. సిద్దిపేట మున్సిపాలిటీకి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.11కోట్ల 99లక్షల 45వేలు పన్నుల వసూలు లక్ష్యం కాగా, గత సంవత్సరం బకాయిలు రూ.3 కోట్ల 38లక్షల 47వేలతో కలిపి మొత్తంగా రూ.15కోట్ల 37లక్షల 92వేల పన్నుల వసూలు లక్ష్యం ఉంది. ఈ నెల 18 వరకు 2023-24కు చెందిన పన్ను రూ.8కోట్ల 83లక్షల 59వేలు, పాత బకాయిలకు సంబంధించిన వాటిలో రూ.3కోట్లు 19 లక్షలను అధికారులు వసూలు చేశారు. మార్చి 2024 నాటికి పన్నుల వసూళ్లకు చివరి తేదీ ఉండటంతో మున్సిపల్ అధికారులు లక్ష్యాన్ని చేరుకునే దిశగా సాగుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3 కోట్లు15లక్షల 86వేలు, బకాయిలు రూ.3కోట్ల 8లక్షల28వేలతో మొత్తంగా ఇంకా రూ.6 కోట్ల 24లక్షల 14వేలను వసూలు చేయాల్సి ఉన్నది. మున్సిపాలిటీలో విభజించిన కేటగిరిల వారీగా మొదటి కేటాగిరిలో నివాసాలు, నివాసేతర సముదాయాలు, మిక్స్‌డ్ అసెస్మెంట్లు మొత్తంగా 34098 ఉన్నాయి. ఈ కేటగిరిలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11కోట్ల 30లక్షల 65వేలు, బకాయిలు రూ. కోటి 12లక్షల 74వేలతో కలిసి మొత్తం రూ.12కోట్ల 43లక్షల 39వేలు వసూలు చేయాల్సి ఉన్నది. కాగా, ఇప్పటి వరకు రూ.8 కోట్ల 86లక్షల 71వేల మేర పన్నులు వసూలు చేయగా, ఇంకా రూ.3కోట్ల 56లక్షల 68వేలు వసూలు చేయాల్సి ఉన్నది. మొత్తంగా మొదటి కేటగిరిలో 71.31శాతం మేర పన్నులు వసూలు చేశారు. రెండో కేటగిరిలో ప్రభుత్వ కార్యాలయాలు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు) సంబంధించినవి 82 అసెస్మెంట్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన పన్నుల వసూళ్ల డిమాండ్ రూ.29కోట్ల 4లక్షల 53వేలు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు రూ.2కోట్ల 7లక్షల 7వేలు వసూలు చేశారు. రూ.26కోట్ల 7లక్షల 46 వేలు వసూలు చేయాల్సి ఉంది.

### వందశాతం పన్నుల వసూలే లక్ష్యం



సిద్దిపేట మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరంలో 100శాతం పన్నుల వసూలే లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది పనిచేస్తుంది. పన్నుల వసూళ్ల డిమాండ్‌కు అనుగుణంగా ఇప్పటి వరకు 59.42శాతం పన్నుల వసూలు చేశాం. నివాస, నివాసేతర, కమర్షియల్ కేటాగిరిలో 71.31శాతం మేర పన్నులను వసూళ్లు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తియ్యే నాటికి పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేస్తాం.

– మున్సిపల్ కమిషనర్ బి.సంపత్‌కుమార్



సిద్దిపేట పట్టణ వ్యూ

---

# రైతన్నా.. జర భద్రం

- పురుగుల మందుల్లో రకాలను గుర్తించి తెగులుకు అనుగుణంగా వాడుకోవాలి
- పిచికారీ చేసే సమయంలో అత్యంత జాగ్రత్తలు అవసరం
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరి

**ఇబ్బడి ముబ్బడిగా పురుగుల మందు వాడితే ఎన్నో అనర్థాలు**

హుస్నాబాద్, డిసెంబర్ 26: యాసంగి సీజన్‌లో పంటల సస్య రక్షణ చర్యలు తీసుకుని, పంట ఆరోగ్యంగా పెరిగేలా చేయడమే లక్ష్యంగా రైతులు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నది. వరి, మొక్కజొన్న, కంది, పప్పు దినుసులు, వేరుశనగ తదితర పంటలు ఏపుగా పెరిగే సమయంలో ఎరువులతోపాటు పురుగుల మందులను కూడా వాడాల్సి ఉంటుంది. పంట సాగు చేసినప్పటి నుంచి పెరిగే, కోత దశలో కూడా పురుగు, తెగుళ్లు సోకుతాయి. ఈ సమయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకొని మందులను వాడితేనే మంచి ఫలితాలు, దిగుబడులు వస్తుంది. కానీ, రైతులు ఎరువుల దుకాణాల యజమానులు, పక్క రైతుల సలహాలు తీసుకొని మాత్రమే ఎరువులు, పురుగులు మందులు వాడుతున్నారు. దీంతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. తెగులు ఒకటైతే మరొక ఫెస్టిసైడ్‌ను వాడటం, మోతాదుకు మించి వాడటంతో దిగుబడుల్లో తేడాలు వస్తుంటాయి. ప్రతి సీజన్‌లో రైతులు ఇటువంటి పొరపాట్లు చేస్తూ పంటనష్టపోవడం చూస్తూనే ఉంటాం. ముఖ్యంగా పురుగుల మందులు కొనుగోలు నుంచి వాటిని పంటలపై పిచికారీ చేసేంత వరకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నదని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

### ఎలాంటి స్ప్రేయర్లు వాడాలి..

రైతులు తమ పంటపొలాల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేందుకు వివిధ రకాల స్ప్రేయర్లు వాడుతారు. ఇందులో పవర్, కంప్రెషర్ స్ప్రేయర్లు ఉంటాయి. పవర్ స్ప్రేయర్లు వాడకంలో మందు వినియోగం ఎక్కువ, నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. వీటి ద్వారా స్ప్రే చేస్తే పంటలోని ప్రతి భాగంపై మందు పడి పురుగులు, తెగుళ్లు తొందరగా చనిపోయే అవకాశం ఉంటుంది. కంప్రెషర్ స్ప్రేయర్లతో పిచికారీ చేసినప్పుడు చిన్నచిన్న తుంపర్లుగా మాత్రమే పంటపై పడుతుంది. పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే పొగలాగా వ్యాపించి ప్రతిచోట పడుతుంది. రైతులు ఎక్కువగా పవర్‌స్ప్రేయర్లకే ప్రాధాన్యతనిస్తే మంచిది. అకేలా స్ప్రేయర్లు, చేతి పంపులు, కంప్రెషర్ పంపులతో ప్రయోచనం తక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### మోతాదుకు మించి వాడితే పంటకు నష్టం



క్రిమిసంహారక మందులను మోతాదుకు మించి వాడితే పంటకు నష్టం. అవసరమైనంత మేరకే వాడాలి. పురుగుల మందులను ఎంత తక్కువ వాడితే అంత మంచిది. వీటి వల్ల భూమిలోని సారం తగ్గిపోయి భవిష్యత్తులో పంటలు పండే అవకాశం ఉండకుండా పోతుంది. మందులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు అవసరం. పంటకు ఏ తెగులు వచ్చిందో నిర్ధారించుకొని అందుకు తగిన మందును ఎంపిక చేసుకొని మాత్రమే ఉపయోగించాలి. పురుగుల మందును కలిపేటప్పుడు కూడా కొలతను విధిగా పాటించాలి. అప్పుడే పంట ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

– నాగరాజు, వ్యవసాయాధికారి, హుస్నాబాద్ మండలం



పంటపై పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

### మందులు ఎక్కువగా అవసరమయ్యే పంటలు..

వాణిజ్య పంటలతోపాటు కూరగాయల పంటలకు ఎక్కువగా పురుగుల మందులను వాడుతారు. ముఖ్యంగా వరి, పత్తి, మిరప, వేరుశనగ, కంది, పొగాకు, బెండ, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర పంటలకు క్రిమిసంహారక మందుల అవసరం ఎక్కువగా ఉంటుంది. కూరగాయల సాగులోనూ పురుగుల మందు అవసరం ఉంటుంది. కూరగాయలు, ఆకుకూర పంటలపై మోతాదుకు మించి ఫెస్టిసైడ్స్ వాడితే ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. కాబట్టి సరైన జాగ్రత్తలు పాటించాలి.

### ఆరోగ్యంపై క్రిమిసంహారక మందుల ప్రభావం అధికం...

పురుగుల మందుల వాడకం మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. పురుగుల మందుల ప్రభావానికి గురైన వాళ్లలో ప్రత్యుత్పత్తి, పెరుగుదలలో మార్పులు సంభవించడం, హైపర్ యాక్టివిటీ, శరీర భాగాల మధ్య సమన్వయ లోపం, ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడం, వికారం, వాంతులు, విరేచనాలు, స్పృహ కోల్పోవడం లాంటివి జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ మందులు వాడేటప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### ఎలాంటి పరిస్థితుల్లో వాడాలి...

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ముఖ్యమైన విషయం. పంటలు ఏపుగా పెరిగే దశలో పంటకు మేలు చేసే కీటకాలు, పురుగులు కూడా ఉంటాయి. ఇందులో మిత్ర పురుగులు, బదనికలు లాంటివి ఉంటాయి. వీటికి అపాయం జరుగకుండా ఉండే క్రిమిసంహారక మందులను మాత్రమే ఉపయోగించాలి. పంటకు మేలు చేసే పురుగుల కంటే నష్టపర్చే పురుగులు అధికమైనప్పుడు పంటకు నష్టం వాటిల్లుతుంది. నష్టపరిచే పురుగు రకం ఏంటీ, ఆ పురుగులను నాశనం చేసే ఫెస్టిసైడ్ ఏంటీ అనేది పూర్తిస్థాయిలో గుర్తించి వాడితేనే పంటకు మేలు జరుగుతుంది. తెగుళ్లకు సంబంధించిన మందులు పురుగులను చంపేందుకు పనికిరావు. పురుగుల మందులను కలిపిన వెంటనే పిచికారీ చేయాలి. ఆలస్యం చేస్తే దాని ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

### మందులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పురుగుల మందులు కొనుగోలులో ఎక్కువగా దుకాణాదారుడి లేదా పక్క రైతుల సలహాలు పాటించడం మానేయాలి.
- పంటకు ఆశించింది పురుగా లేదా తెగులా లేదా పోషకాహార లోపమా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకొని మాత్రమే పురుగుల మందును ఎంపిక చేసుకోవాలి. లేకుంటే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.
- పురుగుల మందును అనేక వ్యాపార సంస్థలు వేర్వేరు పేర్లతో తయారు చేసి విక్రయిస్తారు. సాధారణ పేర్లతో పాటు వ్యాపార నామాలు కూడా రైతులు తెలుసుకోవాల్సిన అవసరమున్నది.
- పురుగు మందుల డబ్బాలపై త్రిభుజాకారంలో ఒక రంగు ఉంటుంది. ఎరుపు రంగు ఉంటే అత్యధిక విషపూరితమైది. పసుపు రంగు ఉంటే అధిక విషపూరితం. నీలం రంగులో ఉంటే మధ్యస్థ విషపూరితం. ఆకుపంచ్చ రంగు ఉంటే స్వల్ప విషపూరితమని తెలుసుకోవాలి.
- రైతులు వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీలు, దుకాణాల నుంచి మాత్రమే పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన ప్రతి పురుగుల మందుకు విధిగా బిల్లు తీసుకొని భద్రపరుచుకోవాలి.
- పురుగుల మందు డబ్బాలపై గడువు తేదీని విధిగా చూడాలి. గడువు తీరిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదు.
- డబ్బాలకు మూతలు సరిగ్గా ఉన్నాయా లేదా ముందుగానే చూసుకోవాలి. లీకేజీ ఉన్న డబ్బాల్లోని పురుగుల మందు నాణ్యతను కోల్పోయే ప్రమాదమున్నది.
- ఆహార పదార్థాలను, పురుగుల మందులను ఒకేసారి కొనుగోలు చేయకూడదు. రెండింటినీ ఒక చోట నిల్వ ఉంచరాదు.
- పురుగుల మందులు కొనుగోలు చేసి తరలించేటప్పుడు, నిల్వ ఉంచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో కాకుండా వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక స్థలంలోనే భద్రపరచాలి.

### పిచికారీలో జాగ్రత్తలు..

- పురుగుల మందు ద్రావణాన్ని చేతితో కలుపకుండా కర్రతో/ గ్లౌజులు వేసుకొని మాత్రమే కలపాలి.
- పురుగుల మందు డబ్బాపై ఉన్న టేబుల్‌లో వివరాలను పూర్తిగా చదవాలి. అందులో సూచించిన విధంగా మాత్రమే మోతాదు ప్రకారం పురుగు మందును, నీటిని కలిపి పంటలపై పిచికారీ చేయాలి.
- రెండు, మూడు మందులను కలిపి వాడేటప్పుడు వాటి కలయిక జరుగుతుందా, లేక ఏమైనా అనర్థం జరుగుతుందా అనే విషయాన్ని తెలుసుకున్నాకే వాడాల్సి ఉంటుంది.
- మందును పిచికారీ చేసేటప్పుడు విధిగా మూతికి మాస్కు, చేతులకు గ్లౌజులు ధరించాలి.
- పిచికారీ చేసేటప్పుడు గంజి పెట్టిన దుస్తులు ధరించాలి. మందు అవశేషాలు దుస్తులపై పడినా ఆరోగ్యంపై ప్రభావం చూపదు.
- పురుగుల మందులను చల్లని వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే పిచికారీ చేయాలి. అంటే ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చల్లాలి. తీవ్రమైన ఎండలో గానీ వర్షంలో గానీ పిచికారీ చేయరాదు.
- నిపుణులు సిఫార్సు చేసిన మోతాదులో మందు పరిమాణాన్ని సరిగ్గా కొలిచి నీటితో కలపాలి.
- గడ్డి మందుతో పురుగుల మందు కలిసి స్ప్రే చేయరాదు.
- మందు స్ప్రే చేసే సమయంలో ఆహార పదార్థాలు, పానీయాలు గానీ సేవించరాదు. మందు పిచికారీ పూర్తయ్యాక స్నానం చేసిన తరువాత మాత్రమే తినడం, సేవించడం చేయాలి.
- ఏదైనా సమయంలో పురుగుల మందు వల్ల హాని జరిగినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి.
- పురుగుల మందులను పిల్లలకు, పశువులకు దూరంగా ఉంచాలి. చిన్న పిల్లలచే పిచికారీ చేయించొద్దు.
- మందు పిచికారీ చేశాక డబ్బాలను భూమిలో పాతిపెట్టాలి. చెరువులు, కుంటలు, బావుల్లో వేయవద్దు.



---



వంకాయ పంట సాగు

# 'ఆరుతడి' లాభాల ఒడి..!


**తక్కువ నీటితో తీరొక్క కూరగాయల సాగు**

గజ్వేల్, డిసెంబర్ 26: ఆరుతడి పంటలతో అధిక లాభాలు సాధించేందుకు రైతులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయల పంటలు సాగు చేస్తూ దిగుబడి సాధిస్తున్నారు. తక్కువ నీటితో పండించే కూరగాయలను సాగు చేస్తున్నారు. స్వీట్‌కార్న్ మొక్కజొన్న, ఉల్లిగడ్డ, పూలతోటల పెంపకంపై కూడా రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతంలో రైతులు పండించిన కూరగాయలు, స్వీట్‌కార్న్ మొక్కజొన్నను హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. హైదరాబాద్ పట్టణానికి సరిపడా కూరగాయలను ఎగుమతి చేయడంలో గజ్వేల్ ప్రాంత రైతులే ఎక్కువ.

గజ్వేల్ సమీకృత కూరగాయల మార్కెట్లో రైతులు ప్రతిరోజూ ఉదయం తాజా ఆకుకూరలు, కూరగాయలను విక్రయాలు చేపడుతున్నారు. గజ్వేల్ మండలం గిరిపల్లి, కొమటిబండ, బంగ్లా వెంకటాపూర్, ధర్మారెడ్డిపల్లి, అహ్మదీపూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్, వర్గల్ మండలం పాతూర్, పాములపర్తి, గౌరారం, చౌదర్‌పల్లి, మర్కూక్ మండలం ఎర్రవల్లి, గణేశ్‌పల్లి, ములుగు మండలంలోని క్షీరసాగర్, అన్నసాగర్, వంటిమామిడి, చిన్నతిమ్మాపూర్, నర్సంపల్లి, ములుగు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతుల పొలాలు పచ్చని కూరగాయల పంటలతో కనిపిస్తున్నాయి. రైతులు పండించిన కూరగాయల పంటలను విక్రయించుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం మార్కెట్లను ఏర్పాటు చేసింది. గజ్వేల్‌లో సమీకృత మార్కెట్, ప్రజ్ఞాపూర్ సమీపంలోని పాతూర్ వద్ద రాజీవ్ రాహదారిపై కూరగాయల మార్కెట్లో రోజూ వందలాది మంది రైతులు వారు పండించిన కూరగాయలను అమ్ముకొని లాభాలు అర్జిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్‌కు నిత్యం క్వింటాళ్ల కొద్దీ కూరగాయలను రైతులు తీసుకొచ్చి ప్రైవేటు సంస్థలకు విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ జిల్లాలకు తాజా కూరగాయలను తరలిస్తున్నారు. ఆరుతడి పద్ధతుల్లో రైతులు కూరగాయలను సాగు చేయడంతో అధిక లాభాలు పొందుతున్నారు. ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులను వ్యవసాయాధికారులు ప్రోత్సాహిస్తున్నారు.



పచ్చిమిర్చి పంట సాగు



చిక్కుడు పంట సాగు

---

# కరోనాపై.. అప్రమత్తం

- ప్రారంభమైన ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు
- సంగారెడ్డి జిల్లాలో యాక్టీవ్‌లో రెండు కేసులు
- హోంక్వారెంటైన్‌లో ఇద్దరికీ చికిత్స

**ప్రతి ఒక్కరూ కొవిడ్ నిబంధనలు పాటించాలి: వైద్యాధికారులు**



సంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం రెండు కరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయి. ప్రస్తుతం వారిని హోంక్వారైంటన్‌లో ఉంచి చికిత్సలు అందజేస్తున్నారు. కేసులు పెరగకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అదే సమయంలో కేసుల సంఖ్య పెరిగితే చికిత్సలు అందజేసేందుకు వీలుగా సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. సంగారెడ్డి దవాఖానతోపాటు వైద్యారోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ బెడ్లను సిద్ధంగా ఉంచారు. కరోనా కేసులు పెరగటంలేదని, ప్రజలు భయాందోళనకు గురికావద్దని, ప్రతి ఒక్కరూ కొవిడ్ నిబంధనలు పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.



సంగారెడ్డి దవాఖానలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

### కొనసాగుతున్న కొవిడ్ పరీక్షలు..

కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో కొవిడ్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన పరిధిలో ఆర్‌టీపీసీఆర్ పరీక్షా కేంద్రంలో ప్రతిరోజూ 15 పరీక్షలు చేస్తున్నారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే, పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలో కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవసరమైన ర్యాపిడ్ టెస్టు కిట్లను అందుబాటులో ఉంచారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో రెండు పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. రామచంద్రాపురంలో ఒక పాజిటివ్ కేసు నమోదు కాగా, కంది మండలం కవలంపేటలో మరో పాజిటివ్ కేసు నమోదైంది. పాజిటివ్ వచ్చిన ఇద్దరినీ హోంక్వారంటైన్‌లోఉంచి చికిత్సలు అందజేస్తున్నారు. కరోనా కేసులు సంఖ్య పెరిగితే చికొత్స అందజేసేందుకు వీలుగా వైద్యారోగ్యశాఖ తగిన ఏర్పాట్లు చేపడుతుంది. సంగారెడ్డి జిల్లా దవాఖానలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయటంతోపాటు 30 ఆక్సిజన్ బెడ్లను సిద్ధంగా ఉంచారు. పీహెచ్‌సీలో 1064 ఆక్సిజన్ బెడ్లను, ప్రైవేటు దవాఖానల్లో 800 ఆక్సిజన్ బెడ్లను సిద్ధంగా ఉంచారు.

### కొవిడ్ నిబంధనలు పాటించాలి



కరోనా విషయంలో ప్రజలు ఎవ్వరూ భయాందోళనకు గురికావద్దు. జిల్లాలో ప్రస్తుతం రెండు పాజిటివ్ కేసులు ఉన్నాయి. కొవిడ్ వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి, కొవిడ్ నిబంధనలను పాటించాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. జన సంచారంలో ఎక్కువగా ఉండకూడదు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

– డా.గాయత్రిదేవి, సంగారెడ్డి డీఎంహెచ్‌వో